క్లుప్తంగా

నూతన తహసీల్దార్‌కు అభినందన



భట్టిప్రోలు: భట్టిప్రోలు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన డి.వెంకటేశ్వరరావును మండలంలోని ఎండీయూ ఆపరేటర్లు గురువారం కలసి సత్కరించారు. ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి ఆధ్వర్యంలో ఎండీయూ ఆపరేటర్లు ఆయనను కలసి అభినందించారు. తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయనను కోరారు.

భట్టిప్రోలులో తీరనున్న కరెంట్ కష్టాలు

రూ.1.50 కోట్లతో నూతన 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

భట్టిప్రోలు: భట్టిప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 5-ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను రూ.1.50 కోట్లతో ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న ఒక్క ట్రాన్స్‌ఫార్మర్ ఫుల్‌లోడ్ కావడం వల్ల విద్యుత్ సరఫరాకు నిరంతరం అంతరాయం కలుగుతుంది. విద్యుత్ శాఖ కరెంట్ కష్టాల నుంచి తప్పించేందుకు యుద్ధ ప్రాతిపదికన మరొక 5-ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తుంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు నెలఖారులోగా పూర్తి కానున్నట్లు విద్యుత్ సబ్ స్టేషన్ ఇన్‌చార్జి ఏఈ ఏడుకొండలు గురువారం తెలిపారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి వస్తే కరెంటు కష్టాలు తీరనున్నాయి.

కుష్ఠు నిర్ధారణ సర్వే వేగవంతం

కొల్లూరు: వ్యాధి నిర్ధారణ సర్వే చేసే బృందాలు ప్రతి ఇంటిని తప్పనిసరిగా సందర్శించి ఆయా కుటుంబాలలోని సభ్యులందరికి కుష్ఠు వ్యాధి ఉన్నదీ లేనిది నిర్ధారించుకుని సర్వే పూర్తి చేయాలని కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఎస్.సుష్మసుశాన్ అన్నారు. గురువారం కొల్లూరు పీహెచ్‌సీలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు కుష్ఠు వ్యాధి నిర్ధారణ సర్వేపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో ఆశ కార్యకర్త, వలంటీర్ బృందంగా ఏర్పడి ఇంటింటిని సందర్శించి వివరాలు సేకరించాలన్నారు. ఒక గృహంలో ఎన్ని కుటుంబాలు నివసిస్తున్నాయో పూర్తి సమాచారం తీసుకోవడంతోపాటు, రెండేళ్ల వయస్సు పైబడిన ప్రతి వ్యక్తికి కుష్ఠు వ్యాధికి సంబంధించిన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. చర్మంపై మచ్చలు, బుడిపెలు, అంగవైకల్యం, గాయాలు వంటివాటితో బాధపడుతున్న వారిని క్షుణంగా పరిశీలించాలన్నారు. కుష్ఠువ్యాధికి సక్రమంగా చికిత్స తీసుకుంటే ఏడాదిలో ఉన్న బహుళ ఔషధ చికిత్సతో పూర్తిగా నయం చేసే అవకాశం ఉందన్నారు. వైద్యశాల సీహెచ్‌ఓలు సుబ్బారెడ్డి, విజయలక్ష్మి, సూపర్‌వైజర్‌లు ఎ.సువార్త, పి.శ్రీనివాసరావు, వి.మేరి పాల్గొన్నారు.

26 నుంచి ఇంటింటి సర్వే..

నిజాంపట్నం: కుష్ఠువ్యాధి రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని డాక్టర్ ప్రణవి తెలిపారు. కూచినపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణంలో డాక్టర్ ప్రణవి, డాక్టర్ ఉషారాణిలు వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశావర్కర్లకు కుష్ఠువ్యాధి నిర్మూలనకు చేపట్టవల్సిన ఇంటింటి సర్వేపై శిక్షణను ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 26వ తేదీ నుంచి ఇంటింటి సర్వే నిర్వహించి, అనుమానిత మచ్చలు ఉన్న వ్యక్తులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పలు అంశాలపై శిక్షణనిచ్చారు. హెల్త్‌సూపర్‌వైజర్ మురళీ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో కుండపోత



తెనాలిఅర్బన్: తెనాలిలో బుధవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఉక్కపోత పోస్తుండగా సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు వర్షం కురుస్తునే వచ్చింది. దీంతో పట్టణంలోని దాదాపు అన్ని ప్రధాన రహదారులు జలమయ్యామయ్యాయి. అలాగే మురుగు కాల్వలు పొంగి రోడ్డుపై మురుగు చేరింది. సాయంత్రం కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు కొంత ఇబ్బంది పడ్డారు. అయితే వాతావరణం అంతా చల్లగా మారడంతో సేదతీరారు.

సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలి

- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్
- చందోలు పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలు



సిబ్బందితో మాట్లాడుతున్న బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

పిట్టలవానిపాలెం: సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చందోలు పోలీసులను ఆదేశించారు. మండలంలోని చందోలు పోలీసు స్టేషన్‌లో గురువారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతిఒక్కరూ అంకిత భావంతో నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. చందోలు స్టేషన్‌కు విచ్చేసిన ఎస్పీకి పోలీసు సిబ్బంది గౌరవ వందనంతో స్వాగతం పలికారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి ఎస్‌హెచ్‌ఓ, రైటర్, కంప్యూటర్ గదులను, కేస్ ప్రాపర్టీ భద్రపరచిన గదిని పరిశీలించారు. అనంతరం చందోలు స్టేషన్ పరిధిలోని మహిళా పోలీసులు, పోలీసు సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. సిబ్బందికి ఉన్న శాఖాపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన దిశ యాప్ మెగా డ్రైవ్‌లో చందోలు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మహిళా పోలీసులు ఎక్కువ సంఖ్యలో దిశ యాప్‌లను డౌన్‌లోడ్ చేయించడంతో వారిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి బహుమతులు అందజేశారు. గ్రామంలో ఉన్న ఒంటరి మహిళల గృహాలు సందర్శించి వారి సమస్యల గురించి తెలుసుకోవాలని మహిళా పోలీసులకు సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించే వివిధ క్రైమ్ రికార్డులను, సీడీ ఫైల్సును జిల్లా ఎస్పీ పరిశీలించారు. ఆయన వెంట బాపట్ల డీఎస్పీ వెంకటేశ్వర్లు, పట్టణ సీఐ కృష్ణయ్య, కర్లపాలెం ఎస్ఐ ఎం.శివయ్య, సిబ్బంది ఉన్నారు.

క్షేత్రస్థాయిలో సమస్యలకు పరిష్కారం

- సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున
- ఆలపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

ఆలపాడు(వేమూరు): క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. చుండూరు మండలం ఆలపాడులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆయన గురువారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటి వద్ద సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షంలో కూడా మంత్రి మేరుగ నాగార్జున కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకునేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. గ్రామంలో సమస్యలు ఉంటే నాదృష్టికి తీసుకొని వస్తేవాటిని పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ప్రజా సమస్యల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష పథకం కూడా తీసుకొని రావడం జరిగిందని ఆయన అన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు తీరుపై పూర్తిగా పని చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నిధులతో గ్రామ పంచాయతీలో సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రెయిన్ వంటి సమస్యలు పరిష్కారం చేసుకోవడం జరుగుతుందన్నారు. నారాల శెట్టి సురేష్, ఎంపీటీసీ ఉపర్ల ప్రశాంతి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గాదె శివరామ కృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఆళ్ల రమణారెడ్డి, బొల్లిముంత ఏడుకొండలు, అమర్తలూరు సాంబశివరావు, ఉప సర్పంచ్ టి.సాంబశివరావు, కూచిపూడి బుజ్జిబాబు, గ్రామ సర్పంచ్‌లు వుయ్యూరి అప్పిరెడ్డి, విజయభాస్కర్, సుబ్బారెడ్డి, శ్రీనివాసరరావు, పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు తెనాలిలో విద్యుత్ అదాలత్

భట్టిప్రోలు: కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెస్సల్ ఫోరం(సీజీఆర్ఎఫ్), విజయవాడ ఆధ్వర్యంలో శుక్రవారం తెనాలి చెంచుపేటలోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విద్యుత్ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యుత్ అదాలత్, అవగాహనా సదస్సు నిర్వహిస్తున్నట్లు రేపల్లె ఏడీఈ ఎస్.భాస్కరరావు గురువారం తెలిపారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను (విద్యుత్ అంతరాయాలు, హెచ్చు తగ్గులు, మీటర్, బిల్లుల) రాత పూర్వకంగా సర్వీస్ కనెక్షన్ నెంబర్, పూర్తి చిరునామా, సెల్ నెంబర్‌తో అర్జీలు అందించి పరిష్కరించుకోవచ్చునని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు ఉప్పూడిలో గడప గడపకు మన ప్రభుత్వం

రేపల్లెరూరల్: మండలంలోని ఉప్పూడి పంచాయతీలో ఈ నెల 23వ తేదీ శుక్రవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు, నియోజకవర్గ నాయకుడు మోపిదేవి రాజీవ్‌లు పాల్గొనే కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

వేమూరు: గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య నిర్వహణకు కార్మికులు నిరంతరం కృషి చేస్తున్నారని గ్రామ సర్పంచి లక్ష్మీ శ్రీనివాస్ తెలిపారు. వేమూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికులు గ్రామ సర్పంచ్ చేతుల మీదుగా యూనిఫామ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధికి పారిశుద్ధ్య కార్మికుల శ్రమ ఎంతో ఉందన్నారు. అందువల్ల గ్రామ పారిశుద్ధ్య కార్మికుల అవసరాలు చూసుకోవాలని బాధ్యత పంచాయతీ కార్యదర్శిపై ఉందని ఆమె తెలిపారు. పంచాయతీ కార్యదర్శి భూపతి రెడ్డి, వేమూరి చంద్రపాల్, గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేయాలి

ఆంధ్రప్రదేశ్ టెక్స్ట్‌బుక్స్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి



పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీ టెక్స్ట్‌బుక్స్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి

చెరుకుపల్లి: రాష్ట్రంలో ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పాఠ్యపుస్తకాలను ప్రతి విద్యార్థికి పంపిణీ చేయాలని లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తప్పవని ఆంధ్రప్రదేశ్ టెక్స్ట్‌బుక్స్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి హెచ్చరించారు. మండలంలోని గుళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం సందర్శించి పాఠశాలలోని విద్యార్థులకు సెమ్-1 ద్వారా అందించిన టెక్స్ట్‌బుక్స్‌ను పరిశీలిస్తూ చిన్నారులతో చదివించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న పాఠ్యపుస్తకాలు జేవీకే కిట్లు, యూనిఫామ్ అందరికి అందించాలని అధికారులను ఆదేశించారు. పాఠ్యపుస్తకాలు అందించిన తరువాత ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యాసన సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి సారించి, అనుమానాలను ఎప్పటికప్పుడు నివృతి చేస్తూ అనుకున్న సమయానికి సిలబస్ పూర్తి చేయాలన్నారు. జిల్లా టెక్స్ట్‌బుక్స్ డైరెక్టర్ వజ్రబాబు, ఎంఈఓ నవీన్ కుమార్, ఇన్‌ఛార్జి హెచ్ఎం వాకా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువు అభివృద్ధికి నిధులు కేటాయించాలి



జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిసిన రజక కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మారెళ్ల శ్రీదేవి శ్రీనివాస్

బాపట్ల: జె.పంగులూరు మండలంలోని తూర్పు కొక్కెరపాడు గ్రామంలోని చెరువు అభివృద్ధికి నిధులు కేటాయించాలని రజక కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ మారెళ్ల శ్రీదేవి శ్రీనివాస్ జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు వినతి పత్రం అందించారు. కలెక్టరేట్‌లో గురువారం కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా శ్రీదేవి శ్రీనివాస్ మాట్లాడుతూ తూర్పు కొక్కెరపాడులో చెరువు మరమ్మతులకు బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.6లక్షలు నిధులు కేటాయించాలని కోరారు. జిల్లాలోని చెరువుల అభివృద్ధికి కార్పొరేషన్ ద్వారా నిధులు విడుదల చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో సర్పంచ్ శ్రీనివాసరావు, రజక సంఘం నాయకులు ఉదయగిరి రంగన్న, సురేష్, చందలూరి శ్రీనివాసరావు ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ నాయకులు

చెరుకుపల్లి: పదో తరగతి విద్యార్థి ఉప్పాల అమర్నాథ్ కేసును 45 రోజుల్లో విచారణ పూర్తి చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్‌కుమార్ పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉప్పాల అమర్నాథ్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఐలాండ్ సెంటరు నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ నిరంజన్ బాబుకు, ఎస్ఐ కొండారెడ్డికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.ఆర్య, సీఐటీయూ నాయకుడు శరత్, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై 30న మహాధర్నా

తెనాలి: సంక్షోభంలో ఉన్న వ్యవసాయరంగాన్ని కాపాడుకునేందుకు, రైతాంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ జూన్ 30న విజయవాడలో జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి జొన్నా శివశంకరరావు కోరారు. స్థానిక చెంచుపేటలోని ప్రజాసంఘాల కార్యాలయంలో గురువారం ముద్దన సాంబశివరావు అధ్యక్షతన తెనాలి కమిటీ సమావేశంలో శివశంకరరావు మాట్లాడారు. గత ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో పంటలు నష్టపోయిన రైతులందరికీ పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయాలని కోరారు. ఆహార పంటలకు ఎకరాకు రూ.10 వేలు, వాణిజ్యపంటలకు రూ.25 వేల చొప్పున ఇన్‌పుట్ సబ్సిడీని పెంచాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ చినరావూరు-జంపని మధ్య మూసివేసిన రైల్వే గేటును తెరిపించాలనీ, పంటకాల్వలు, మురుగుకాల్వల్లో తూటాకు, గుర్రపుడెక్కను వెంటనే తొలగించాలని కోరారు. కంచర్ల తారకేశ్వరరావు, అడపాల దుర్గాప్రసాద్ మాట్లాడారు.

విద్యార్థికి ఉపాధ్యాయుల ఆర్థికసాయం

పిట్టలవానిపాలెం: మండలంలోని పిట్టువారిపాలెం మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి యేత్ర అంకమ్మ రెడ్డికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆర్థిక సహాయం చేశారు. ఇటీవల యేత్ర అంకమ్మ రెడ్డి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కడుపులో తీవ్రంగా ఇబ్బంది ఏర్పడడంతో గుంటూరులోని ఒక ప్రైవేట్ హాస్పటల్‌లో శస్త్ర చికిత్స చేయించాల్సి వచ్చింది. అయితే అందుకు గాను సుమారు రూ.2 లక్షలకు పైగా ఖర్చయింది. విద్యార్థిది పేద కుటుంబం కావడంతో అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. పాఠశాల ఉపాధ్యాయులు గురువారం అంకమ్మరెడ్డిని పరామర్శించి కొంత ఆర్థికసాయం చేశారు.

పథకాలు ప్రజలకు అందేలా చర్యలు

పిట్టలవానిపాలెం: ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు, సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మారుతీశేషమాంబ గ్రామ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని చందోలు-1 గ్రామ సచివాలయాన్ని తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ స్థాయి సమాచారాన్ని సేకరించి అందజేయాలని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. గ్రామ కార్యదర్శులు శేషగిరిరావు, వీరేంద్ర, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వలసల నివారణకు 'ఉపాధి' దోహదం

రేపల్లె రూరల్: కూలీల వలసలను నివారించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ దారం విజయ్ అన్నారు. మండలంలోని పెనుమూడి పంచాయతీ లంకభూముల్లో గురువారం ఉపాధి హామీ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకం ద్వారా ఉపాధి పొందాలని కోరారు. కార్డు లేనివారు దరఖాస్తు చేసుకుని పొందాలన్నారు. సచివాలయ సిబ్బంది, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు కార్డులపై అవగాహన సదస్సు



కౌలు గుర్తింపు కార్డులపై అవగాహన సదస్సు నిర్వహించిన ఏఓ



కౌలు రైతుకు సాగు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న సర్పంచ్ వెంకటలక్ష్మి, డీడీఏ విజయనిర్మల

కుచ్చెళ్లపాడు(వేమూరు): కౌలు పొలాలు సాగు చేసే రైతులకు కౌలు గుర్తింపు కార్డు చాలా అవసరమని మండల వ్యవసాయాధికారి చందోలు సునీత తెలిపారు. వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడు రైతు భరోసా కేంద్రంలో కౌలు రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు పొలాలు సాగు చేస్తున్న కౌలు రైతులు ప్రతి ఒక్కరూ కౌలు గుర్తింపు కార్డు పొందాలని ఆమె చెప్పారు. కౌలు గుర్తింపు కార్డు ఉన్న రైతులు పంట నమోదు చేసుకోవటానికి, పంట నష్ట పరిహారం నమోదుకు, పంట కొనుగోలుకు, ఇన్సూరెన్సుకు, ఈ సాగు ధ్రువీకరణ పత్రం ఉపయోగ పడుతుందని ఆమె తెలిపారు. అందువల్ల కౌలు రైతులందరు గుర్తింపు కార్డు పొందాలని ఆమె కోరారు. రైతు భరోసా కేంద్రం సిబ్బంది ద్వారా పంట నమూనా తీయించుకొని భూసార పరీక్షలు కార్డు పొందాలని ఆమె చెప్పారు. చదలవాడ, కుచ్చెళ్లపాడు, వెల్లబాడు సర్పంచ్‌లు దాసరి రమేష్, గాజుల వెంకట సుబ్బయ్య, వెల్లబాటి బుల్లియ్య, వీఆర్వో రైతులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో...

పిట్టలవానిపాలెం: కౌలు దారులకు మేలు చేసేందుకే ప్రభుత్వం సీసీ ఆర్ కార్డులు జారీ చేస్తున్నట్లు ఎంపీపీ షేక్ బాజి తెలిపారు. మండలంలోని మంతెనవారిపాలెం, పిట్టలవానిపాలెం గ్రామాలలోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ శాఖ, రెవెన్యూశాఖల ఆధ్వర్యంలో సాగుదారులకు పంటసాగు హక్కు పత్రాలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. భవనంవారిపాలెం గ్రామ సర్పంచ్ మోదుగుల శివనాగేశ్వరి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దొంతిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి ,గ్రామ రెవెన్యూ అధికారులు జ్యోతి, రమేష్, వ్యవసాయ విస్తరణాధికారి సుదర్శనరావు, శేషమ్మ, పంచాయతీ కార్యదర్శి ఐనంపూడి శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు శివనాగేశ్వరి, రైతులు ఉన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: సీసీఆర్ కార్డులు ఉన్న కౌలు రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ సబ్సిడీ పథకాలు అందుతాయని డీడీఏ డాక్టర్ విజయనిర్మల తెలిపారు. మండలంలోని ఏట్రవారిపాలెం, పాత నందాయపాలెం గ్రామాలలో గురువారం కౌలు రైతులకు సాగు ధృవీకరణ పత్రాలపై అవగాహన సదస్సులు జరిగాయి. ఈ సందస్సులో డీడీఏ విజయనిర్మల మాట్లాడుతూ సాగు ధ్రువీకరణ పత్రాలు తీసుకున్న ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం అమలు వర్తిస్తుందని తెలిపారు. ఏడీఏ ఎ.లక్ష్మి మాట్లాడుతూ సాగు ధ్రువీకరణ పత్రాలు ఉన్న కౌలు రైతులు సాగు చేసిన పంటలు ప్రకృతి వైపరిత్యాలకు గురై నష్టపోయినప్పుడు పంట నష్ట పరిహారం అందుతుందని తెలిపారు. వ్యవసాయ శాస్త్రవేత్త ఓబయ్య మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేయాలని చెప్పారు. గ్రామ సర్పంచ్‌లు చీరాల వెంకటలక్ష్మి కావూరి చిట్టెమ్మ, వ్యవసాయ శాస్త్రవేత్త సురేఖాదేవి, వీఆర్వో సాంబయ్య, ఏఈఓ భాగ్యలక్ష్మి, గ్రామ వ్యవసాయ సహాయకులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

చెరుకుపల్లిలో...

చెరుకుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కౌలు రైతులకు అందిస్తున్న కౌలు గుర్తింపు కార్డులు తప్పని సరిగా తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి బాలాజీ గంగాధర్ తెలిపారు. మండల కేంద్రలోని సచివాయం-1లో గురువారం కౌలు గుర్తింపు కార్డుల పై అవగాహనా కార్యక్రమం నిర్వహించి దరఖాస్తు చేసుకున్న కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు అందజేశారు. వీఆర్‌వో శ్రావణ్ కుమార్, ఏఈవోలు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న సర్పంచి, దాతలు

కొల్లూరు: ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడు బాధ్యతగా స్వీకరించాలని తోకలవారిపాలెం సర్పంచి టి.కృష్ణమోహన్ అభిప్రాయపడ్డారు. గురువారం మండలంలోని తోలకవారిపాలెం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన నోట్‌బుక్స్, జామంట్రీ బాక్స్‌లు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. తోకలవారిపాలెం శివారు కృష్ణనగర్‌కు చెందిన గొరిపర్తి చిన్నసత్యనారాయణ జ్ఞాపకార్థం అయన కుమారులు దిలీప్, ప్రదీప్‌లు రూ. 5 వేలు పైగా విలువ చేసే నోట్‌పుస్తకాలు, విద్యార్థులకు అవసరమైన ఇతర వస్తువులను సమకూర్చి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

పెసర్లంక(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెసర్లంక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (హెచ్ఈ)లో చదువుకున్న పూర్వ విద్యార్థి వక్కలగడ్డ పద్మజ పాఠశాలలోని 25 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ అందించారు. వీటిని గురువారం విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెసర్లంక దేవభక్తుని కోటయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం ఎస్కే మహబూబ్ బాషా, ఫిజికల్ డైరెక్టర్ దాసరి ప్రసాద్, తెలుగు ఉపాధ్యాయుడు ఎకేవీ పవన్ కుమార్, హెచ్ఎం వి.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

దళితులపై దాడికేసులో ఐదుగురిపై కేసు

బాపట్లటౌన్: దళితులపై దాడిచేసిన కేసులో ఐదుగురిపై కేసు నమోదుచేసిన సంఘటన గురువారం మండలంలోని చుండూరుపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చుండూరుపల్లి గ్రామానికి చెందిన అంకమ్మచౌదరి, వంశీకృష్ణ అనే ఇద్దరు అన్నదమ్ములకు ఐదు ఎకరాల పొలం వివాదం ఉంది. వంశీకృష్ణ వాటాగా వచ్చిన పొలాన్ని అదే గ్రామానికి చెందిన సతీష్‌బాబు అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చారు. పొలం సాగుచేస్తున్న సతీష్, అతని భార్య రాహేలుపై వంశీకృష్ణ అన్న అంకమ్మచౌదరి, అతని కుమారుడు దినేష్, అతని భార్య సుజాతలు, మరో ఇద్దరు కులం పేరుతో దూషించడమే కాకుండా దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదుమేరకు రూరల్ ఎస్ఐ కె.వెంకటప్రసాద్ ఐదుగురు వ్యక్తులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేశారు. బాపట్ల డీఎస్పీ వెంకటేశులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.